సాక్షి జగిత్యాల

గురువారం ● 8 ● జూన్ ● 2023



చిన్నారులకు అన్నప్రాసన

పెగడపల్లి : వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన చేశారు.



పెద్దమ్మ బోనాలు

కథలాపూర్ : బొమ్మెనలో బుధవారం పెద్దమ్మతల్లి బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/29.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సంకష్టహర చతుర్థి వేడుకలు



మహాగణపతికి పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని మహాగణపతి ఆలయంలో బుధవారం సంకష్టహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముత్యాల శర్మ మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన



శివమారుతిరెడ్డిని అభినందిస్తున్న మకరంద్

జగిత్యాల: కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివ మారుతిరెడ్డి సివిల్స్‌లో 132వ ర్యాంకు సాధించిన విషయం విదితమే. ఆయన బుధవారం అదనపు కలెక్టర్ మకరంద్‌ను జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మకరంద్ ఆయనకు అభినందనలు తెలిపారు.

రైతుల కన్నీళ్లు పట్టవా?



నిరసన తెలుపుతున్న నాయకులు

కథలాపూర్(వేములవాడ): కలిగోట సూరమ్మ ప్రాజెక్టు అసంపూర్తిగా మిగిలి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు కన్నీళ్లు పెడుతుంటే ప్రభుత్వం ఇదేమీ పట్టకుండా చెరువుల పండుగ నిర్వహించడం శోచనీయమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. బుధవారం ప్రాజెక్టు వద్ద నిరసన తెలిపారు. సూరమ్మ ప్రాజెక్టు పేరిట ఓట్లు దండుకోవడానికే బీఆర్‌ఎస్ నాయకులు కథలాపూర్, మేడిపెల్లి మండలాల రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిందని, తూకం వేసినా డబ్బులు రావడంలేదని రైతులు కన్నీటిపర్యంతమవుతుంటే.. బీఆర్‌ఎస్ నాయకులు దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం దారుణమన్నారు. పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీమ్, నాయకులు కల్లెడ గంగాధర్, పులి హరిప్రసాద్, మార్కం రాజేశం, లవుడ్యా రాజేష్, జవ్వాజి రవి, తోకల దేవన్న, అంబటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

పెగడపల్లి(ధర్మపురి): పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఠాణాలో అమలవుతున్న 5ఎస్‌లో భాగంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణ, సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. ప్రతీరోజు వాహనాలు తనిఖీ చేయాలని అన్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ జరపాలని ఆదేశించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, గ్రామ పోలీస్ అధికారి తమకు కేటాయించిన గ్రామాల్లో విధిగా పర్యటించి, ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురైనా, పోగొట్టుకున్నా.. సీఈఐఆర్ నూతన అప్లికేషన్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. డీఎస్పీ ప్రకాశ్, మల్యాల సీఐ రమణమూర్తి, ఎస్సై కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

గన్.. ధనాధన్



31 మే 2023న

- కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామ శివారు రైల్వేట్రాక్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన సందరగిరి లక్ష్మీనర్సయ్యను తనిఖీ చేయగా పిస్టల్(ఆటో పిస్టల్ మేడ్ ఇన్ యూఎస్‌ఏ), రెండు మ్యాగ్జిన్‌లు, మూడు కేఎఫ్ 7.65 ఎంఎం బుల్లెట్లు లభించాయి.

18న అక్టోబరు 2018న

- కోరుట్లలో ముంబయికి చెందిన రాజుభయ్యా రెండు తుపాకులు, 12 బుల్లెట్లను వేములవాడకు చెందిన తిరుపతికి విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

3 ఫిబ్రవరి 2020న

- గొల్లపల్లి మండలం ఇబ్రాజీపల్లి గ్రామంలో సొంత భార్యను తుపాకీతో కాల్చేందుకు యత్నించాడు మేడిపల్లి మండలం గోవిందారం గ్రామానికి చెందిన ప్యాట శ్రీనివాస్. అక్కడే ఉన్న ఆమె మేనమామ బైరం రాజిరెడ్డి ఆపేందుకు యత్నించగా తూటాలు తగిలి గాయపడ్డాడు.

9 మే 2018న

- ముంబాయ్ కల్లుదుకాణం యజమానులను వేధిస్తున్న పోడెటి సత్యనారాయణగౌడ్‌ను ధర్మపురిలోని ఓ వైన్స్ వద్ద తుపాకీతో ముంబాయ్‌కి చెందిన రాజుభాయ్ కాల్చి చంపాడు.

21న అక్టోబరు 2017న

- సైన్యంలో పనిచేసిన ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ మాజీ సర్పంచ్ సుంకె రాజన్నపై 7.65 ఎంఎం తుపాకీతో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో రాజన్న గాయపడ్డాడు. ఈ ఘటనలో రిటైర్డ్ ఉద్యోగితోపాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

- జిల్లాలో తుపాకుల కలకలం
- ఆరేళ్లలో ఐదు కేసులు
- అప్రమత్తమైన పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లాలో మారణాధాయుధాల వినియోగం పెచ్చుమీరుతోంది. కొందరు అసాంఘిక శక్తులే కాదు.. కొందరు సామాన్యులు కూడా తుపాకులతో ప్రత్యర్థులపై కాల్పులకు తెగపడుతున్నారు. మరికొందరైతే కట్టుకున్న భార్యను, ప్రాణంతో సమానమైన స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులపైనా ఆయుధాలు ఎక్కుపెడుతున్నారు. కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద ఇటీవల పిస్టల్, బుల్లెట్లు, మ్యాగ్జిన్‌లు లభించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

ఆరేళ్లలో ఐదు సంఘటనలు..

- జిల్లాలో 2017 నుంచి ఇప్పటివరకు ఐదు తుపాకుల సంఘటనలు చోటుచేసుకున్నాయి.
- నక్సల్స్ ప్రాబల్యం పూర్తిగా తగ్గిన తర్వాత జిల్లాలో తుపాకులు వెలుగుచూస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పాత నేరస్తుడి సమాచారంతో..

కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన పాత నేరస్తుడు రాజుభాయ్ ఉరఫ్ గంగారాం కొన్నేళ్లపాటు ముంబాయ్‌లోని మాఫియా నాయకులతో కలిసి పనిచేసినట్లు పోలీసు రికార్డుల్లో ఉంది. ప్రస్తుతం అతడు అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. అదే గ్రామానికి చెందిన లక్ష్మీనర్సయ్య కొద్దిరోజుల క్రితం రాజుభాయ్‌ని కలిశాడు. తనకు ఓ ఆయుధం కావాలని కోరాడు. ముంబాయ్‌లో తన పాత స్నేహితుల వద్ద తుపాకులు దొరుకుతాయని, వారి సెల్‌నంబర్లు, చిరునామాలను రాజుభాయ్ లక్ష్మీనర్సయ్యకు ఇచ్చాడు. దీంతో లక్ష్మీనర్సయ్య ముంబాయ్ వెళ్లి పిస్టల్ కొనుగోలు చేసుకుని తీసుకొచ్చాడు. తుపాకీ పనిచేస్తుందా? లేదా? అని చెక్ చేసుకునేందుకు కొద్దిరోజుల క్రితం అయిలపూర్ శివారు అటవీ ప్రాంతంలోకి వెళ్లి ఒకరౌండ్ కాల్పులు జరిపాడు.



అయిలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్న పిస్టల్, మ్యాగ్జిన్‌లు(ఫైల్)

పోలీసుల అప్రమత్తం

జిల్లాలో అనుమతి లేకుండా ఆయుధాల తరలింపు, వినియోగంతో అప్రమత్తమైన పోలీసులు నిఘా పెంచారు. గ్రామాలు, పట్టణాల్లో విస్తృత తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నించి వదిలేస్తున్నారు. ఒకప్పుడు నక్సల్స్‌తోపాటు కొందరు ప్రముఖులు రక్షణ కోసం అనుమతి తీసుకుని ఆయుధాలు కలిగి ఉండేవారు. ఇప్పుడు నక్సలిజం ప్రాబల్యం చాలా తగ్గింది. కానీ, సామాన్యులు సెటిల్‌మెంట్లు, దందాలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలు సాగించేందుకు ఆయుధాలు వాడడం ఆందోళన కలిగిస్తోంది.

చర్యలు తీసుకుంటాం



ప్రజలు అనుమతి లేకుండా మారణాయుధాలు కలిగి ఉండరాదు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అసాంఘిక చర్యలకు పాల్పడినా నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో అనుమానితులు కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. పోలీసు శాఖ ప్రజల భద్రతకు నిరంతరం పనిచేస్తుంది.

– భాస్కర్, ఎస్పీ

చెరువుకు జలకళ.. చేపకు చేవ



నీటితో కళకళలాడుతున్న పెగ్గెర్ల ఊర చెరువు



చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు

- మిషన్ కాకతీయతో పూర్వవైభవం
- విస్తృతంగా చేపల పెంపకం
- మత్స్యకార్మికులకు మెరుగైన ఉపాధి
- నేడు జిల్లాలో చెరువుల పండుగ

కథలాపూర్(వేములవాడ): ఎటు చూసినా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు.. పగుళ్లు బారిన కట్టలు.. కొద్దిపాటి వానలకే మత్తళ్ల దూకుడు.. గతంలో చెరువులు, కుంటల పరిస్థితి అది. ఇప్పుడు పరిస్థితి మారింది. మిషన్ కాకతీయ ద్వారా నాలుగు విడతలో చేపట్టిన మరమ్మతులతో చెరువులు, కుంటల్లో నీటి నిల్వల సామర్థ్యం గణనీయంగా పెరిగింది. దీనికితోడు కాళేశ్వర జలపరవళ్లతో భూగర్భ జలాలు వృద్ధి చెంది ఏడాది పొడవునా జలకళ సంతరించుకుంటోంది. ఆయకట్టు సాగు విస్తీర్ణం వృద్ధి చెందడంతోపాటు చేపల పెంపకం ద్వారా మత్స్యకారులకు ఉపాధి మెరుగైంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు చేపట్టే చెరువుల పండుగ సందర్భంగా కథనం..

685 చెరువులు.. 1.47 కోట్ల చేపల పెంపకం..

- ఈ వర్షాకాలంలో జిల్లాలోని చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీళ్లు చేరుతాయని అధికారులు భావిస్తున్నారు.
- దీంతో ఈఏడాది 685 చెరువుల్లో 1,47,43,347 చేపపిల్లల పెంపకం లక్ష్యంగా నిర్దేశించారు.
- చెరువులు, కుంటల్లో నీటి సామర్థ్యాన్ని బట్టి చేపపిల్లలను మత్స్యకార్మికులకు పంపిణీ చేసి పెంపకం చేపడతారు.
- ఈ సీజన్‌లో సెప్టెంబర్ నుంచి ఈప్రక్రియ చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు.

ఐదేళ్లలో 40శాతం పెరిగిన చేపపిల్లల పెంపకం..

- ఐదేళ్ల క్రితం వరకు చెరువులు, కుంటల్లో ఆశించిన స్థాయిలో నీటినిల్వలు లేవు.
- చేపలు పెంపకంపై మత్స్యకార్మికులు ఆసక్తి చూపలేదు.
- కొందరు ముందుకు వచ్చి చేపపిల్లలను పోసినా.. జనవరి వరకే నీళ్లు అడుగంటి అవి మృతిచెందేవి.
- అయితే, మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పూర్వవైభవం సంతరించుకున్నాయి.
- నీటినిల్వ సామర్థ్యం వృద్ధి చెందింది.
- దీంతో మత్స్యకారులు చేపపిల్లల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు.
- ఐదేళ్ల క్రితం జిల్లాలో 60 లక్షల చేపలు పెంచేవారు.
- నీటి నిల్వల సామర్థ్యం వృద్ధి చెందడంతో ఈసారి 1.47 కోట్ల చేపపిల్లలు పెంచాలని లక్ష్యం నిర్దేశించినట్లు అధికారులు, మత్స్యకారులు తెలిపారు.

మిషన్ కాకతీయ ద్వారా పూర్వవైభవం సాధించిన చెరువులు, కుంటలు	
తొలివిడత	156
రెండోవిడత	200
మూడోవిడత	118
నాలుగోవిడత	132
మొత్తం	606
వెచ్చించిన నిధులు(రూ.కోట్లలో)	115.27

జిల్లా సమాచారం	
మత్స్య సహకార సంఘాలు	229
సభ్యుల సంఖ్య	17,820
మహిళా సహకార సంఘాలు	46
మహిళా సంఘాల సభ్యులు	2,520

చేపల పెంపకంతో ఉపాధి



మా ఊర చెరువులో గతంలో నీళ్లు కొన్నేఉండేవి. ఏటా ఫిబ్రవరి రాగానే చెరువు ఎండిపోయేది. చేపలు ఎదిగేవి కావు. ఉపాధిలేక గల్ఫ్ వెళ్లిన. నాలుగేళ్ల క్రితం మిషన్ కాకతీయ ద్వారా రూ.22 లక్షలు వెచ్చించి మరమ్మతు చేయించుండ్రు. రివర్స్ పంపింగ్‌తో వరదకాలువ జీవనదిగా మారింది. చలికాలమేకాదు.. ఎండకాలంలోనూ ఊరచెరువులో పుష్కలంగా నీళ్లుంటున్నయి. చేపలు పెంచి గ్రామాల్లో అమ్ముతున్నం. మా ఊరిలో 22 మందికి ఉపాధి లభించింది. – నక్క దేవదాస్, మత్స్యకారుడు, పెగ్గెర్ల

పూర్వవైభవం వచ్చింది



మిషన్ కాకతీయ ద్వారా పోసానిపేట శివారు బొమ్మెన ప్రాజెక్టు, కండ్లపెల్లి చెరువులకు మరమ్మతు చేయించారు. బొమ్మెన ప్రాజెక్టులో మూడేళ్లుగా పుష్కలంగా నీళ్లుంటున్నాయి. ఈ రెండింటికీ పూర్వవైభవం వచ్చింది. కండ్లపెల్లి చెరువు, బొమ్మెన ప్రాజెక్టులో చేపలు పెంచుతున్నాం. మా ఊరి మత్స్య సహకార సంఘంలోని 44 మంది చేపలు పట్టి ఉపాధి పొందుతున్నాం. ఇప్పుడిక గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన అవసరంలేదు.

– గంగాధర చిన్నారెడ్డి, మత్స్యకారుడు, పోసానిపేట

పండుగలా వ్యవసాయం

- చెరువులు, కుంటలతో అభివృద్ధి
- కేసీఆర్ పాలనలో జలవనరులకు జీవం
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: 'ఒకప్పుడు వ్యవసాయ దండుగ అన్నవారు.. ఇప్పుడు వ్యవసాయాన్ని పండుగలా చేసుకుంటున్నారు.. చెరువులు, కుంటలు నీళ్లతో నిండుకుండలా తయారు కావడమే ఇందుకు నిదర్శనం.. దీని ద్వారా వ్యవసాయ రంగంలో గణనీయమైన అభివృద్ధి చెందుతోంది' అని సాంఘిక్ష సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక హెచ్‌హెచ్ గార్డెన్‌లో బుధవారం నీటి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంత్రితోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీరు, విద్యుత్ కొరతలతో లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారాయని, వాటిపై ఆధారపడిన రైతులు, కకూలీలు ఉపాధి వెతుక్కుంటూ వలసలు వెళ్లేవారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు విద్యుత్ ఉచితంగా అందిస్తున్నారని, తద్వారా చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయని అన్నారు. వ్యవసాయ రంగం పటిష్టం కావడంతో వలసలు ఆగిపోయాయని తెలిపారు. ధర్మారం మండలం పత్తిపాక, కొత్తపల్లి, బొమ్మిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో నీటిసమస్య తీవ్రంగా ఉండేదని, ప్రస్తుతం భావితరాలకు శాశ్వతంగా నీరు అందించేందుకు నీటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని చెప్పారు. ధర్మపురి నియోజకవర్గంలో 2014కు ముందు అతితక్కువ ఆయకట్టు ఉండేదని, బీళ్లు సుమారు 1.33 లక్షల ఎకరాలు ఉండేవని, ప్రస్తుతం అందులోని 1.26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయితే వందశాతం వ్యవసాయం చేసుకుంటారని అన్నారు. అనంతరం సాగునీటి రంగంలో ప్రతిభ కనపర్చిన ఉద్యోగులను శాలువాలతో సన్మానించారు. అడిషనల్ కలెక్టర్ లత, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, ఏఎంసీ చైర్మన్ రాజేశ్ పాల్గొన్నారు. కాగా, ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ప్రియురాలి కోసం చోరీ

- పోలీసుల అదుపులో యువకుడు
- యువతి నుంచి మొబైల్ స్వాధీనం

జగిత్యాలక్రైం: ప్రియురాలు కోసం ఓ యువకుడు దొంగతనం చేసి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ సంఘటన జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొలాస గ్రామంలో చోటుచేసుకుంది. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన ఓ యువకుడు(20) ఓ యువతిని ప్రేమించాడు. తనకు మొబైల్ ఫోన్ కొనివ్వాలని ఆమె కోరింది. ఆర్థిక స్థోమత లేని ఆ యువకుడు.. ఈనెల 3న రాత్రి అదే గ్రామంలోని ఓ వ్యక్తి ఇంట్లో చొరబడి సెల్‌ఫోన్, పర్స్ చోరీ చేశాడు. ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో దూరి ల్యాప్‌టాప్, బెల్ట్‌షాపులోకి వెళ్లి సుమారు రూ.10 వేల –రూ.20 వేల విలువైన మద్యం అపహరించాడు. బాధితులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ పుటేజీలు పరిశీలించి ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. అందులో ఒక యువకుడు చోరీ చేసిన సెల్‌ఫోన్‌ను తన ప్రియురాలికి అప్పగించినట్లు విచారణలో అంగీకరించాడు. దీంతో సదరు యువతి నుంచి పోలీసులు బుధవారం సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం



ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు–సరోజ దంపతుల 51వ వివాహ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేక్ కట్ చేసి వృద్ధులు, పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, ఎంపీటీసీ ఆకుతోట రాజేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, క్యాతం జీవన్‌రెడ్డి, సిరిపురం రవీందర్, రంగు రామాగౌడ్, మ్యాకల సతీశ్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, బోక్కల నాగరాజు, ఆకుతోట నర్సయ్య, రఫీ, మహేశ్ పాల్గొన్నారు.

జిల్లా రైతులకు 'మద్దతు'

- ధాన్యం మద్దతు ధర పెంపు
- ఎ–గ్రేడ్ క్వింటాలుకు రూ.2,203
- సాధారణ రకానికి రూ.2,183 చెల్లింపు
- మద్దతు ధర ప్రకటించిన కేంద్రప్రభుత్వం
- ఈ వానాకాలం నుంచే అమలు

జగిత్యాలఅగ్రికల్చర్: కేంద్రప్రభుత్వం వివిధ పంటల మద్దతు ధర పెంచడంతో జిల్లాలో ధాన్యం పండిస్తున్న రైతులకు సుమారు రూ.107కోట్ల లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు. మొత్తం 14 పంటల మద్దతు ధర పెంచుతూ సర్కార్ బుధవారం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత వానాకాలంలోనే ఇది అమలులోకి వస్తుందని వెల్లడించింది. అయితే, మద్దతు రూ.143(7శాతం) పెంచడంతో ఇప్పటివరకు ఎ–గ్రేడ్ ధాన్యం క్వింటాల్ రూ.2,060 మద్దతు ధర ఉండగా, ఈవానాకాలంలోనే పెంపు అమలులోకి రానుంది. దీంతో క్వింటాలుకు రూ.2,203 మద్దతు ధర రైతులకు దక్కనుంది. అదేవిధంగా సాధారణ రకం గతంలో రూ.2,040 ఉండగా, ఇప్పుడుది రూ.2,183కు చేరింది. పెరుగుతున్న పెట్టుబడుల నేపథ్యంలో ఈ పెంపు కొంత ఊరట నిచ్చింది. అయితే, సాగు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర పెరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు ఖర్చులు రెట్టింపు..

సాగు ఖర్చు ఏటా పెరుగుతూనే ఉంది. పెట్టుబడులకు అనుగుణంగా పంటలకు మద్దతు ధరలు ప్రకటించాల్సి ఉంది. కానీ, కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగానే మద్దతు ధరలు పెంచుతోందని రైతులు, ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మద్దతు ధరలను నిర్ణయించే కేంద్ర వ్యవసాయ ధరల నిర్ణాయక కమిషన్.. క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతుల నుంచి సాగుఖర్చు వివరాలు స్వీకరిస్తే కొంత మేలు జరిగేదనే అభిప్రాయాలు ఉన్నాయి. గతంలో ఉన్న ధరలకే కొంతశాతం కలిపి చెల్లిస్తుండడంతో సాగు ఖర్చుకు, రైతులకు వచ్చే ఆదాయానికి పొంతన ఉండటం లేదు. ఇవేవీ పట్టించుకోకుండా ధరల నిర్ణాయక కమిషన్.. అంతకు ముందే సిద్ధం చేసిన ప్రతిపాదనలను కేంద్రప్రభుత్వం యథాతథంగా అమలు చేయడంతో రైతులకు అంతంతమాత్రంగానే లబ్ధి జరుగుతోంది. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం సాగు ఖర్చుకు రెట్టింపు ఆదాయం రావాల్సి ఉండగా, ప్రస్తుత మద్దతు ధరలతో కనీసం సాగు ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



3లక్షల ఎకరాల్లో వరి సాగు..

- జిల్లాలో ప్రతీ సీజన్‌లో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు.
- ఎకరాకి 25 క్వింటాళ్ల చొప్పున అంచనా వేస్తే 75 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది.
- ప్రస్తుత ధర రూ.2,060 ప్రకారం రైతులకు రూ.1,545 కోట్లు సమకూరుతుందని అంచనా.
- పెరిగిన మద్దతు ధర క్వింటాలుకు రూ.2,203 చొప్పున లెక్కిస్తే.. రూ.1,652 కోట్ల వరకు అందుతుందని అంచనా.
- ఈలెక్కన ఈ వానాకాలంలో రైతులకు అదనంగా రూ.107 కోట్ల ఆదాయం రానుంది.
- మద్దతు ధర పెంపుతో ఈసారి దొడ్డు రకం ధాన్యం సాగుచేసే అవకాశం ఉంది.

ఏటా రూ.250 పెంచాలి



వరికి ఇప్పటికే ఉన్న ధరకు అదనంగా క్వింటాలుపై కనీసం రూ.250 వరకు మద్దతు ధర పెంచితేనే రైతులకు న్యాయం జరుగుతుంది. ఏటా రూ.50 నుంచి రూ.100 వరకు పెంచుకుంటే పోతే.. మాకు పెద్దగా ప్రయోజనం కలుగదు. ఈమాత్రం మద్దతు పెరగడంతోనే కూలీల ఖర్చు రెట్టింపు అవుతోంది.

– గడ్డం సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉత్తమ రైతు, ధర్మపురి

హరితహారం మొక్కల.. నీటి బిల్లులు పెండింగ్

- ట్రాక్టర్లకు డీజిల్ పోయించేందుకు సర్పంచుల తంటా
- ఏడాదిగా ఒక్క కోరుట్ల రూరల్ మండలంలోనే ఈ పరిస్థితి

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తోంది. కానీ వాటికి పోసే నీళ్ల బిల్లుల విడుదలలో మాత్రం జాప్యం జరుగుతోంది. దీంతో గ్రామ పంచాయతీల పాలకవర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కోరుట్ల రూరల్ మండలంలో ఏడాదిగా ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీళ్లు పోస్తున్నప్పటికీ ప్రభుత్వం ఈజీఎస్ బిల్లులు చెల్లింపుల్లో జాప్యం చేస్తోంది. ఫలితంగా ట్రాక్టర్ల డీజిల్ ఖర్చులకూ నానాతంటాలు పడుతున్నామని సర్పంచులు ఆవేదన చెందుతున్నారు.

రూ.18 లక్షలు పెండింగ్..

కోరుట్ల రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. హరితహారం మొక్కలకు సంబంధించిన నీటి బిల్లులు 2022 మార్చిలో పెట్టారు. చిన్న పంచాయతీలకు సుమారు రూ.లక్ష, పెద్ద గ్రామ పంచాయతీలకు సుమారు రూ.1.5 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. ఈ లెక్కన 15 గ్రామాలకు సుమారు రూ.18 లక్షల ఈజీఎస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.



ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీళ్లు పడుతున్న కూలీలు

ఒక్కో మొక్కకు రూ.1.80..

ప్రతీ గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ బ్లాక్ ప్లాంటేషన్ కలుపుకుంటే చిన్న గ్రామ పంచాయతీల్లో 1,000, పెద్ద గ్రామ పంచాయతీల్లో 1,200 నుంచి 1,400 మొక్కలకు ప్రతీ వారం ట్యాంకర్ల ద్వారా ఉపాధిహామీ కూలీలు నీళ్లు పడుతున్నారు. ఇందుకోసం ఒక్కో మొక్కకు రూ.1.80లను ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఈజీఎస్ ఖాతాల్లో జమ చేస్తుంది. కూలీలకు డబ్బులు అందుతున్నప్పటికీ ట్యాంకర్లకు మాత్రం బిల్లులు రావడం లేదు. అన్ని గ్రామాల్లో జనరల్ బాడీల్లో తీర్మానం చేసి, ఎంబీ రికార్డులు పూర్తయ్యాయి. అయినప్పటికీ బిల్లులు అందకపోవటంతో ట్రాక్టర్లలో డీజిల్ పోయించేందుకు పాలకవర్గాలు ఇబ్బంది పడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమా.. నిధుల్లేవా?

ట్యాంకర్ బిల్లుల చెల్లింపులో జాప్యంపై ప్రజాప్రతినిధులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోరుట్ల మండలానికి చుట్టుపక్కల ఉన్న మండలల్లో బిల్లులు విడుదలవగా ఒక్క ఈ మండలంలోనే ఇలా జరగడం చర్చనీయాంశంగా మారింది. రికార్డులు అప్‌లోడ్ చేయడంలో ఈజీయస్ అధికారుల నిర్లక్ష్యమా లేక నిధుల లేమి కారణమా అనేది తెలియాల్సి ఉంది.

త్వరగా విడుదల చేయాలి



అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించడం లేదు. మొక్కలకు నీళ్లు పట్టిన ట్యాంకర్ బిల్లులు కూడా ఏడాదిగా పెండింగ్ పడటంతో ట్రాక్టర్ డీజిల్ ఖర్చులకు ఇబ్బంది పడుతున్నం. నీళ్ల ట్యాంకర్ బిల్లులు త్వరగా విడుదల చేయాలి.

– గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్ సర్పంచ్, యూసుఫ్‌నగర్

ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం



హరితహారం మొక్కలకు నీరు పోసిన ట్యాంకర్ బిల్లులకు సంబంధించి గ్రామ పంచాయతీ పాలకవర్గాలు తీర్మానాలు ఇచ్చాయి. వాటిని ఎంబీ రికార్డులు చేసి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. బిల్లుల విడుదలలో జాప్యానికి కారణం తెలియదు.

– నీరజ, ఎంపీడీవో

ప్రమాదమని తెలిసినా సెల్లార్లలోనే..

- విద్యుత్ ప్యానెల్ బోర్డులు, జనరేటర్ల ఏర్పాటు
- నోటీసులతో సరిపెడుతున్న జగిత్యాల మున్సిపల్ అధికారులు

జగిత్యాల: రానున్నది వర్షాకాలం.. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోనే అధిక ప్రమాదాలు జరుగుతుంటాయి. మున్సిపాలిటీల్లో ముఖ్యంగా జగిత్యాలలో అత్యధికంగా అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు, పాఠశాలలు, భవనాలు, వాణిజ్య సముదాయాలను సెల్లార్లతో నిర్మిస్తున్నారు. కోరుట్ల, మెట్‌పల్లిల్లో సైతం ఇటీవల ఇలాంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా బిల్డింగ్‌కు కావాల్సిన విద్యుత్ కోసం విద్యుత్ ప్యానెల్ బోర్డు, జనరేటర్లను సెల్లార్లలో ఏర్పాటు చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే అధికంగా వరద నీరు వచ్చి, సెల్లార్లలోనే నిలుస్తుంది. ఆ సమయంలో విద్యుదాఘాతం సంభవించి, బోర్డులు సైతం కాలిపోతుంటాయి. మున్సిపల్ డైరెక్టర్ ఆఫ్ కంట్రీ ప్లానింగ్ నుంచి సెల్లార్లలో ఉన్న విద్యుత్ ప్యానెల్ బోర్డులు, జనరేటర్లను తొలగించి ఫస్ట్ ఫ్లోర్ లేదా అనువైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశాలు వచ్చాయి. కానీ మన మున్సిపల్ అధికారులు మాత్రం సంబంధిత యజమానులు, నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి, సరిపెడుతున్నారు. జగిత్యాల జిల్లాలో ఎక్కడైనా ఇదే పరిస్థితి ఉంది.

ప్రమాదం జరిగితే అంతే...

వర్షాలకు సెల్లార్లలోకి నీరు చేరి, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగితే పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది. ఆస్పత్రుల్లో పేషెంట్లు, అపార్ట్‌మెంట్‌లలో కుటుంబాలు, వాణిజ్య సముదాయాల్లో ప్రజలకు, కార్యాలయాల్లో ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఖరీదైన పరికరాలు, సామగ్రి కాలిపోయి, ఆస్తినష్టం కూడా జరుగుతుంది. ప్రమాదమని తెలిసినా బల్దియా అధికారులు పట్టించుకోకపోవడంతో చాలామంది సెల్లార్లలోనే విద్యుత్ ప్యానెల్ బోర్డులు, జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నారు.



ఓ ఆస్పత్రి సెల్లార్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్యానెల్ బోర్డు, జనరేటర్

చర్యలు తీసుకునే అవకాశం..

మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చిన తర్వాత సంబంధీకులు స్పందించకుంటే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కానీ అది విద్యుత్ శాఖకు సంబంధించిన విషయం కావడంతో వారు తొలగించలేకపోతున్నారు. ఇప్పటికైనా యజమానులు స్పందించి, సెల్లార్లలో విద్యుత్ ప్యానెల్ బోర్డులు, జనరేటర్లను తొలగించి, అనువైన మరోచోట బిగించుకోవాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్‌కు ఎస్పీ అభినందన



శివమారుతిరెడ్డిని అభినందిస్తున్న ఎస్పీ

జగిత్యాల క్రైం: సివిల్స్‌లో 132వ ర్యాంక్ సాధించిన కోరుట్ల మండలంలోని అయిలాపూర్‌కు చెందిన శివమారుతిరెడ్డి, ఆయన తండ్రి అంజిరెడ్డిలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ భాస్కర్ బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రకాశ్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.

ఇసుక డంపులకు బహిరంగ వేలం

మెట్‌పల్లి(కోరుట్ల): మండలంలోని ఆత్మనగర్ శివారులో పట్టుబడ్డ 166 ట్రాక్టర్ల ఇసుక డంపులకు గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు డంపుల ప్రాంతంలోనే వేలం ఉంటుందని, ఆసక్తి గలవారు ముందుగా రూ.10 వేలు చెల్లించాలని సూచించారు.

సెల్‌ఫోన్ రికవరీ



తంగళ్లపల్లి(సిరిసిల్ల): సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ ద్వారా గుర్తించి, బాధితులకు అందిస్తున్నామని తంగళ్లపల్లి ఎస్సై లక్ష్మారెడ్డి అన్నారు. ఇందిరానగర్‌కు చెందిన కడమంచ రాజశేఖర్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని తెలిపారు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి, బాధితుడికి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు. ఫోన్ పోతే ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): కేశవపట్నం మండలం ఇప్పలపల్లికి చెందిన గడ్డం శ్రీనివాస్ తన ఇంటికి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తూ విజిలెన్స్ అధికారుల తనిఖీలో పట్టుబడగా కేసు నమోదు చేసి మొదటినేరం కింద రూ.వేయి జరిమానా విధించారు. అదే వ్యక్తి రెండోసారి పట్టుబడగా కేసునమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి నిందితుడికి రూ.7,542 జరిమానా విధించారు. లేకుంటే రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చినట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ స్వామి తెలిపారు. ఎస్సైలు ఎ.నిరంజన్‌రెడ్డి, టి.నరేష్, సిబ్బంది ఉన్నారు.

గుడుంబా స్వాధీనం



రామడుగు(చొప్పదండి): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్ తండా నుంచి రామడుగు మండలం తిర్మలాపూర్‌కు ఆరు లీటర్ల గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ చంద్రమోహన్ వివరాల మేరకు.. ఎల్లాపూర్ తండా నుంచి తిర్మలాపూర్‌కు కొందరువ్యక్తులు గుడుంబా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎక్సైజ్ అధికారులు రూట్‌వాచ్ నిర్వహించారు. చంద్రయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఆరు లీటర్ల గుడుంబా తరలిస్తుండగా తిర్మలాపూర్ శివారులో పట్టుకున్నారు. చంద్రయ్యపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. ఎస్సై శ్రీనివాస్, హెచ్‌సీ మోసిన్, కమలాకర్, కుమార్‌యాదవ్, కమాలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారు.

శిశువు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

సిరిసిల్లటౌన్: తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సంధ్య రెండో కాన్పు కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి, బుధవారం ఆడబిడ్డకు జన్మించింది. ఆ శిశువు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తి, అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ వెళ్లాలని సూచించారు. బాధిత కుటుంబసభ్యులు 108కి సమాచారం అందించగా సిబ్బంది అనిల్‌కుమార్, పైలట్ పెద్ది శ్రీనివాస్ వచ్చి, పాపను కరీంనగర్ తరలించే క్రమంలో ఆక్సిజన్ అందిస్తూ ఉన్నారు. పాప కళ్లు తెరవడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సరైన సమయంలో శిశువు ప్రాణాలు కాపాడారంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.



శిశువుకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

వేములవాడ ఆస్పత్రికి లక్ష్య సర్టిఫికెట్

వేములవాడరూరల్: వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రికి నేషనల్ హెల్త్ మిషన్ వారు లక్ష్య సర్టిఫికెట్ అందించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ మహేశ్‌రావు బుధవారం తెలిపారు. ప్రతీ విభాగంలో 100 మార్కులకు గాను 86 శాతంతో సర్టిఫికెట్ పొందామన్నారు. లేబర్ రూమ్, మెటర్నిటీ ఆపరేషన్ థియేటర్‌లో గర్భిణులకు అందిస్తున్న సేవలు, సర్వీస్ ప్రొవిజన్, పేషెంట్ రైట్స్, ఇన్‌పుట్స్, సపోర్ట్ సర్వీస్, క్లినికల్ సర్వీసెస్, ఇన్ఫెక్షన్ కంట్రోల్, క్వాలిటీ మేనేజ్‌మెంట్, అవుట్ కమ్స్ అంశాలను నేషనల్ టీం పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ సర్టిఫికేషన్‌తో ఆస్పత్రి అభివృద్ధికి ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్లపాటు నగదు బహుమతి అందిస్తారని తెలిపారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రోత్సాహం, వైద్యులు, సిబ్బంది సహకారంతో సర్టిఫికెట్ సాధించినట్లు పేర్కొన్నారు.



సర్టిఫికెట్ అందుకున్న వైద్య బృందం

నక్సలైట్ల పేరుతో బెదిరిస్తే చర్యలు

- డీఎస్పీ నాగేంద్రచారి
- ఇద్దరి అరెస్టు

వేములవాడ: జనశక్తి నక్సలైట్ల పేరుతో అమాయక ప్రజలను బెదిరిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు. వేములవాడలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నక్సలైట్లమంటూ బెదిరింపులకు పాల్పడ్డ వేములవాడకు చెందిన మునుకా కుంటయ్య, సిరిసిల్లకు చెందిన పోకల సాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిద్దరు వేములవాడకు చెందిన తిరుపతికి భూమి అమ్ముతామని రూ.10 లక్షలు తీసుకుని మోసం చేశారని తెలిపారు. అంతేకాకుండా జనశక్తి మాజీ నక్సలైట్ అని అదనంగా తమకే డబ్బులు ఇవ్వాలని, లేకుంటే చంపుతామని బెదిరించారన్నారు. ఎవరైనా బెదిరింపులకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలని కోరారు.

'సాయికుమార్‌ను విడుదల చేయండి'

సిరిసిల్లక్రైం: న్యాయవాద విద్యార్థి, పీడీఎస్‌యూ మాజీ నాయకుడు పోకల సాయికుమార్ అరెస్ట్ అక్రమమని, వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల కమిటీ రాష్ట్ర కన్వీనర్ గురువారెడ్డి, రాష్ట్ర కో–కన్వీనర్ కొండా నాగేశ్వర్, ప్రొఫెసర్ ఎ.వినయ్‌బాబు, ఇ.రఘునందన్ ప్రకటనలో కోరారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థిగా తన వంతు పాత్ర పోషించిన సాయికుమార్ ప్రగతిశీల విద్యార్థి ఉద్యమంలో కొనసాగినట్లు తెలిపారు. పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థిగా, ప్రస్తుత ఎల్‌ఎల్‌బీ విద్యార్థిగా నిరుద్యోగ సమస్యలపై గళం విప్పడంలో తప్పేంటని ప్రశ్నించారు. ప్రెస్‌మీట్ జరిగిన వెంటనే పోలీసులు చేరుకుని భోజనం చేస్తున్న సాయికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థిపై అక్రమ కేసుల విషయంలో హోంమంత్రి, డీజీపీ జోక్యం చేసుకోవాలని కోరారు.

వైద్య దంపతులకు బెదిరింపులు

- రూ.20 లక్షలు డిమాండ్
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- కేసు నమోదు

కోరుట్ల: అక్రమ నిర్మాణం చేస్తున్నారని వైద్య దంపతులను బెదిరించి, రూ.20 లక్షలు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని రథాల పంపు ఏరియాలో డాక్టర్ రమేశ్ నిర్మిస్తున్న నూతన భవనం అక్రమమని, ఫిర్యాదులు చేస్తూ దాన్ని ఆపేస్తానని ఎ.మహేశ్ బుధవారం బెదిరింపులకు దిగాడు. ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దంటే రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బాధిత వైద్యుడి ఫిర్యాదు మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఇదే విషయంలో తనకు పలువురి నుంచి బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ అయాజ్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జైలు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మద్యం తాగి, వాహనాలు నడిపిన నలుగురికి మెట్‌పల్లి కోర్టు జడ్జి అరుణ్‌కుమార్ బుధవారం జైలుశిక్ష విధించారని ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఇబ్రహీంపట్నంకు చెందిన తోపారపు భూమేశ్, కొమటికొండాపూర్‌కు చెందిన రామగిరి సంతోష్, వర్షకొండకు చెందిన ఆవుల రంజిత్‌లకు మూడు రోజులు, ఇబ్రహీంపట్నంకు చెందిన పత్తిరెడ్డి రాజరెడ్డికి 5 రోజుల జైలుశిక్ష వేసినట్లు పేర్కొన్నారు. 82 మందికి ఒకొక్కరికి రూ.1,000 చొప్పున, ఆరుబయట మద్యం సేవించిన 12 మందికి ఒకొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధించారన్నారు.

సిలిండర్ లీకేజీతో అగ్ని ప్రమాదం



కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలోని నాచుపెల్లి గ్రామంలో అక్కపెల్లి అనిల్ ఇంట్లో బుధవారం సిలిండర్ లీకై, మంటలంటుకొని, ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చిన స్థానికులు వారు వచ్చేలోపే మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు.

9న జాతీయ అప్రెంటిస్‌షిప్ అవగాహన సదస్సు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండెపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, రీజినల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఆర్‌డీఎస్‌డీఈ) ఆధ్వర్యంలో జాతీయ అప్రెంటిస్‌షిప్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లాతోపాటు కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల జిల్లాలకు చెందిన ఐటీఐ పూర్తి చేసినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్టాక్ హోల్డర్స్, ప్రముఖ ఇండస్ట్రియల్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు

వేములవాడరూరల్: ప్రైవేటు పనులకు ప్రభుత్వ నిధులను కాజేసిన సర్పంచ్‌కు జిల్లా అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ సర్పంచ్ నాగుల వేణుగోపాల్ గ్రామంలోని ప్రైవేటు రోడ్డు పనులకు పంచాయతీ నుంచి రూ.1,65,168 దుర్వినియోగం చేసినట్లు అదే గ్రామానికి చెందిన ఏడుమ్మాకల మధుకర్ గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై మండల స్థాయి అధికారులు విచారణ చేపట్టి జిల్లా స్థాయి అధికారులకు నివేదిక ఇచ్చారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నోటీసు అందిన ఏడు రోజుల్లోగా సమాధానం చెప్పాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోటార్లు దొంగిలించిన ముగ్గురి అరెస్టు

వీణవంక(హుజూరాబాద్): వ్యవసాయ బావుల వద్ద బిగించిన మోటార్లు దొంగలించిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన బొల్లు సదానందం, కర్రసదయ్య వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన పర్లపల్లి రాజకుమార్, మోరే కుమారస్వామితోపాటు జయశంకర్ జిల్లా భూపాలపల్లి మొగుల్లపల్లి గ్రామానికి చెందిన వనము సమ్మయ్య కలిసి దొంగలించినట్లు గుర్తించారు. మోటార్లను విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్నరనే సమాచారంతో వల్భాపూర్ గ్రామం వద్ద పట్టుకొని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. కేసును ఛేదించిన హెడ్ కానిస్టేబుల్ సదయ్య, హోంగార్డు రవికుమార్‌ను ఎస్సై అభినందించారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

- మృతుడి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని సింగనపాలెం

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలో మంగళవారం రాత్రి తేళ్ల నాగేశ్వర్‌రావు(32) ఆత్మహత్యకు చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు జిల్లా ముళ్లమూడు మండలం సింగనపాలెం గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావుకు భార్య శిరీష, ఇద్దరు పిల్లలున్నారు. అతను మూడేళ్లుగా జగిత్యాల పట్టణంలోని గోవిందుపల్లిలో కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటూ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కొద్దికాలంగా మద్యానికి బానిసై, నిత్యం భార్యతో గొడవ పడుతున్నాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో మళ్లీ గొడవ పడ్డాడు. దీంతో ఆమె ఇంటి బయట ఉండగా నాగేశ్వర్‌రావు ఇంట్లోకి వెళ్లి, డోర్ పెట్టుకొని, ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల పట్టణ ఎస్సై రమేశ్ తెలిపారు. నాగేశ్వర్‌రావు ఆత్మహత్య చేసుకోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్ వద్ద మృతుడి భార్య శిరీషతో అతని అన్నదమ్ములు తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఆమె ప్రవర్తనతోనే తమ సోదరుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని మహబూబపూర్ ప్రాంతానికి చెందిన ఎండీ.అజీల్‌ను చంపుతానని బెదిరించిన ఎండీ.సల్మాన్‌పై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సల్మాన్ కొంతకాలంగా అజీల్ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. సల్మాన్‌కు తన భార్యతో గొడవలు జరగడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఇంటి యజమాని అజీల్‌కు తన అత్తింటివారితోపాటు కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తుండటంతో సల్మాన్ కోపం పెంచుకున్నాడు. మంగళవారం రాత్రి అజీల్ ఇంటికి వెళ్లి, అతనిపై కత్తితో దాడి చేశాడు. తర్వాత ఫోన్ చేసి, అతనితోపాటు కుటుంబసభ్యులను చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అత్తింటివారిపై వరకట్న వేధింపుల..

జగిత్యాలక్రైం: అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసిన ట్లు జగిత్యాల పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆయ న వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన లావణ్యకు జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన బత్తిని శివశంకర్ ప్రసాద్‌తో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకా లంగా భర్తతోపాటు లావణ్య అత్త రాధ, మామ నీల య్య అదనంగా మరో రూ.2 లక్షల కట్నం తీసుకురా వాలంటూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధి స్తున్నారు. అంతేకాకుండా శివశంకర్ ప్రసాద్ గుట్టుచప్పుడు కాకుండా ఆరు నెలల క్రితం మరో మహిళను వివాహం చేసుకున్నాడు. దీంతో బాధితురాలు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివశంకర్ ప్ర సాద్, రాధ, నీలయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఠాణాకు చేరిన వీవోఏల పంచాయితీ

- విధుల్లో చేరినవారిపై సమ్మె చేస్తున్నవారి ఆగ్రహం
- కాసులు తీసుకున్నారని ఆరోపణ

చందుర్తి(వేములవాడ): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ నిరవధిక సమ్మెకు దిగిన ఐకేపీ వీవోఏల మధ్య ఐక్యత లోపించింది. చివరికి వారి పంచాయితీ ఠాణాకు చేరింది. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలంలో 30 మంది వీవోఏలు ఉన్నారు. వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు స్వరూప, మరో ఐదుగురు విధుల్లో చేరుతున్నట్లు మంగళవారం ఐకేపీ ఏపీఎం రజితకు జాయినింగ్ లెటర్లు అందించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన మిగతా 24 మంది వీవోఏలు కాసులు తీసుకొని, సమ్మెను నీరుగార్చారంటూ ఆరోపించడంతోపాటు దూషించారు. దీంతో స్వరూప, ఎన్గల్ వీవోఏ శేషాద్రి బుధవారం పోలీసులను ఆశ్రయించారు. తాను మాట్లాడుతానంటూ ఎస్సై రమేశ్ గురువారం ఇరువర్గాల వారిని ఠాణాకు రావాలని సూచించినట్లు తెలిసింది.

బీఆర్ఎస్ భవన్‌కు భూ కేటాయింపు రద్దు చేయాలి

కొత్తపల్లి(కరీంనగర్): హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో భారత రాష్ట్ర సమితి భవన్‌కు కేటాయించిన భూమిని వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కే.నగేశ్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో ఇంటింటికి వైఎస్సార్‌టీపీ పేరిట బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రూ.550 కోట్ల విలువ చేసే భూములను చౌకగా రూ.35 కోట్లకే కేటాయిరచడం చట్టరీత్యా నేరమన్నారు. తెలంగాణ ప్రజలను దగా చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తూ విలువైన భూములను అప్పనంగా దోచుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

బీఆర్ఎస్‌కు ఒక భవనం ఉండగా మరో భవనం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ భవనాలు, ఢిల్లీలో భవన నిర్మాణానికి అయ్యే రూ.1200 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు ఆడెపు విశ్వక్‌పై మంగళవారం రాత్రి వీధికుక్క దాడి చేసింది. ఈ దాడిలో గాయపడ్డ బాలుడిని కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మళ్లీ బుధవారం అదే కుక్కతోపాటు మరో నాలుగు వీధికుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో బాలుడి పొట్ట, వీపు, కాళ్లపై గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించి మరోసారి చికిత్స చేయించారు. వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పలుమార్లు మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన ఆడెపు భూమయ్య (67) మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడు. భూమయ్య కమాన్‌పూర్ నుంచి జూలపల్లికి నడుచుకుంటూ వెళ్తుండగా కమాన్‌పూర్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. తలకు తీవ్ర గాయాలుకాగా కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే భూమయ్య మృతి చెందాడని వైద్యులు తెలిపారు. భూమయ్య కుమారుడు సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ తెలిపారు.

గడ్డి, పైపులు దగ్ధం

గంగాధర(చొప్పదండి): మండలకేంద్రంలోని మోతె వీరయ్య, ఎడవెల్లి పర్శరాములు పంటపొలాల వద్ద బుధవారం ప్రమాదవశాత్తు గడ్డికి నిప్పంటుకుని దగ్ధమైంది. సమీపంలోని పైపులుసైతం కాలిపోయాయి. సర్పంచు మడ్లపల్లి గంగాధర్ పంచాయతీ వాటర్‌ట్యాంకర్‌తో మంటలు ఆర్పివేయించాడు.